క్లుప్తంగా

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



విశేష అలంకరణలో సీతారామలక్ష్మణులు

నంద్యాల(వ్యవసాయం): శ్రీరామనవమి సీతారామ కల్యాణం జరిగి 16 రోజులు కావడంతో స్థానిక నందమూరినగర్‌లోని కోదండ రామాలయంలో సోమవారం స్వామివారి పట్టాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితులు స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి ఆశీనులు చేశారు.వేదమంత్రాల నడుమ పట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టాభిషేక ఘట్టాన్ని తిలకించి భక్తులు తన్మయత్వం చెందారు.

గురురాజలో అవార్డు ఫెస్ట్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజ స్కూల్‌లో సోమవారం అవార్డు ఫెస్ట్ 2025 కార్యక్రమాన్ని డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, డాక్టర్ రవికృష్ణ, మౌలాలిరెడ్డి పాల్గొన్నారు. 2024–25 ఏడాదిలో జరిగిన నేషనల్ స్టేట్ లెవల్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపిన 85 మంది విద్యార్థులకు జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే వివిధ పోటీ పరీక్షలు, క్రీడల్లో రాణించిన విద్యార్థులను సన్మానించారు.

అంతర్జాతీయ టెన్నిస్ టోర్నీలో ప్రతిభ



ఫైజ్

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ టెన్నిస్ సింగిల్స్ టోర్నమెంట్‌లో నంద్యాల వాసి ఫైజ్ ప్రతిభ కనబరిచినట్లు తల్లిదండ్రులు మహమ్మద్ పర్వేజ్, తల్లి యాస్మిన్ ముబీన్ పేర్కొన్నారు. ఫైజ్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ బఫేలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మిచిగన్ నగరంలో జరిగిన ఎంఏసీ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించి టోర్నమెంట్‌లో ఒక్క ఓటమి లేకుండా 18 విజయాలతో అద్భుత రికార్డు సృష్టించినట్లు తెలిపారు. అమెరికాలో నంబర్‌వన్ బెస్ట్ ఆల్ అమెరికన్ టీంకు ఎంపికై తెలుగు కీర్తిని పెంచారన్నారు. ఫైజ్‌ను పలువురు అభినందించారు.

శ్మశానాలకు స్థలాలు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): అన్ని గ్రామాల్లో శ్మశానాలకు స్థలాలు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బాలవెంకట్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు కావస్తున్నా చనిపోతే పూడ్చడానికి శ్మశానాలు లేకపోవడం దారుణమన్నారు. అలాగే డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, రహదారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీపీఎం నాయకులు వరమయ్య, విజయ్‌కుమార్, రత్నమయ్య, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, కృష్ణ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



కాలిపోతున్న గడ్డివామి

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం చాబోలు గ్రామంలో సోమవారం సాయంత్రం గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఒంటిద్దు పెద్ద నరసింహారెడ్డికి చెందిన రూ.2 లక్షల విలువ చేసే గడ్డివామి దగ్ధమవుతుండడంతో సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ అధికారులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే గడ్డివామి మొత్తం కాలి బూడిదైపోయింది. సొంత పొలం లేకున్నా పశు సంపదను కాపాడుకునేందుకు నరసింహారెడ్డి పొరుగు రైతుల నుంచి గడ్డిని కొనుగోలు చేశాడు. గడ్డిమొత్తం కాలిపోవడంతో పశువులకు మేత ఎలా తేవాలో తెలియక ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు ఆదుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్ స్కూల్లో ఆరో తరగతి ప్రవేశానికి సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మోడల్ స్కూల్లో ప్రవేశానికి 119 మంది దరఖాస్తు చేసుకోగా 102 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ-2 ప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు.

బాని'సెల్' కావొద్దు

- సెలవుల్లో మొబైల్ గేమ్స్ వద్దు
- కంటి చూపునకు ముప్పంటున్న వైద్యులు
- అవగాహన లేకుంటే జీవితం అంధకారం
- ఔట్ డోర్ గేమ్స్‌తో శారీరక, మానసిక ఒత్తిళ్లు దూరమవుతాయంటున్న నిపుణులు





వీడియో గేమ్స్ ఆడుతున్న చిన్నారులు, కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నంద్యాల(న్యూటౌన్): పాఠశాలలకు సెలవులు ప్రకటించే సమయం ఆసన్నమైంది. ఇప్పటికే సీబీఎస్‌ఈ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు సెలవులు ఇవ్వడంతో సెల్ గేమ్స్‌కు పరిమితం అవుతున్నారు. ఆధునిక ప్రపంచంలో సెల్‌ఫోన్ ప్రాధాన్యం పెరిగినా చిన్నారుల్లో దాని అతి వినియోగం వల్ల కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిలో ప్రధానం కంటి సమస్యలు. ఈ విషయంలో తల్లిదండ్రులు సైతం బాధ్యతగా ఉండాల్సిన అవసరం ఉంది. వారి కాళ్లకు అడ్డం పడకుండా, ఏదో ఒకదానికి వేధించకుండా కుదురుగా ఉంచడానికి ఆ చిన్నారులకు సెల్‌ఫోన్ ఇచ్చేసి ఓ మూల కూర్చోబెడుతున్నారు. కానీ పిల్లల్లో సెల్‌ఫోన్ వినియోగం వల్ల వారి కంటిపై పడే ఒత్తిడి వల్ల చిన్న వయసులో వారు కంటి సమస్యల బారిన పడుతున్నారనే విషయం మరిచిపోతున్నారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ఎందుకంటే ప్రపంచాన్ని కళ్లతోనే చూడాల్సి ఉంటుంది. కంటి సమస్యలు విద్యార్థుల్లో సరైన సమయంలో గుర్తించి తగిన చికిత్సను అందిస్తే పెద్ద సమస్యల నుంచి కాపాడిన వారమవుతాం.

కంటి సంరక్షణకు ఆహారం

విటమిన్ ఏ,సీ,ఈ ఉండే ఆహారం తీసుకోవాలి. ఒమెగా ఫ్యాటి యాసిడ్స్, క్యారెట్, గోంగూర, విటమిన్ ఏ కలిగిన చేపలు ఎక్కువగా తీసుకోవాలి. సూర్యకాంతిలో రోజుకు ఒక గంట ఆడించడం చాలా అవసరం. దాని వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉండి అన్ని విధాలా వృద్ధి చెందుతారు.

కంటిపై సెల్‌ఫోన్ ప్రభావం

సెల్ వినియోగం అతిగా ఉండడం వల్ల కళ్లు డ్రైగా మారతాయి. మైనస్ పవర్ పెరిగే అవకాశం ఎక్కువ. చీకటి గదుల్లో సెల్‌ఫోన్ చూడడం వల్ల కంటిపై ఒత్తిడి పెరిగి ఎదిగే పిల్లల్లో కంటి సమస్యలు రోజురోజుకు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

పిల్లల్లో వచ్చే కంటి సమస్యలు

మయోపియా: మయోపియా అంటే దూరపు చూపు మందగించడం. ప్రస్తుత కాలంలో 14 సంవత్సరాల లోపు పిల్లల్లో ఈ మయోపియా సమస్య ఎక్కువైందని కంటి వైద్యులు చెబుతున్నారు.

హైపర్ మెట్రోపియా: దీనినే దగ్గర చూపు మందగించడం అంటారు.ఇది పిల్లల్లో ఎక్కువగా కనిపించదు.

యాంబ్లియోఫియా: ఒక కన్ను సరిగా ఉండి మరో కన్ను అభివృద్ధి చెందకపోవడం.

స్ట్రాబిస్ మస్: దీనినే మెల్లకన్ను అంటారు. రెండు కళ్ల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో ఈ సమస్య వస్తుంది.

పిల్లల్లో కంటి సమస్యలు గుర్తించండి ఇలా..

- టీవీ చాలా దగ్గరగా కూర్చుని చూడడం.
- పాఠశాలల్లో పక్కన ఉన్న పిల్లల పుస్తకాలు చూసి రాయడం.
- చదివేటప్పుడు తల ఒక వైపు తిప్పి, ఒక కంటితో చదవడం
- కళ్లు అస్తమాను చిన్నవి చేయడం.
- కళ్లు తరచూ రెప్పలు వేయడం.
- తలనొప్పి, తల తిరడగం, ముఖంలో చిరాకు, పుస్తకాలు ముఖానికి దగ్గరగా పెట్టుకుని చదవడం.

జాగ్రత్తలు అవసరం



తల్లిదండ్రులు తమ పిల్లలకు కనీసం ఏడాదికి ఒకసారైన కంటి పరీక్షలు చేయించాలి. మూడేళ్ల వయసు నుంచే పరీక్షలు చేయించడం ఉత్తమం. పిల్లల్లో కంటి సమస్యలు గుర్తిస్తే వెంటనే కంటి వైద్యున్ని సంప్రదించాలి. ఆధునిక చికిత్స విధానంలో విద్యార్థులు, చిన్నారుల్లో సమస్య పెద్దది కాకుండా నిరోధించవచ్చు. అంబయ్యోపియాను గుర్తించి చికిత్స చేయకపోతే అది శాశ్వతంగా చూపు కోల్పోవడానికి దారి తీస్తుంది. దీనికి 14 ఏళ్ల లోపు చికిత్స అందించాలి. సాధ్యమైనంత వరకు పిల్లల్లో సెల్‌ఫోన్ వినియోగం తగ్గించడం ఉత్తమం.

–విజయభాస్కరరెడ్డి, కంటివైద్య నిపుణుడు, నంద్యాల

హామీలు అమలు చేయాలని ధర్నా

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగభృతి, ఉచిత బస్సు, తదతర పథకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను నమ్మించి దగా చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. నిరుద్యోగులు, మహిళలు, యువకులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ప్రజల ఆగ్రహానికి గురి కాకముందే ఎన్నికల హామీలు అమలు చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి చౌడప్ప, పీడీఎస్‌యూ నాయకులు రాంబాబు, ఆటో కార్మిక సంఘం నాయకులు రాజు, శంకరయ్య, రఫీ, యాకూబ్, కలాం, ఫరూక్, ఆనంద్, సులోచన, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(అర్బన్): వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని.. ముస్లిం సమాజాన్ని ఇబ్బంది పెట్టే విధంగా ఉందని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ సవరణ చట్టానికి వత్తాసు పలకడం ముస్లిం సమాజాన్ని కలిచి వేస్తోందని చెప్పారు. తన ఇంటి ఆవరణలో సోమవారం ముస్లింలు, ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్ఫ్ సవరణ చట్టం రద్దుపై పోరాటం చేసేందుకు అన్ని సంఘాలు కలిపి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆరు మందితో అడ్‌హక్ కమిటీ ఏర్పాటు అయ్యింది. అనంతరం ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యయుతంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఎలా ఎదుర్కోవాలనే దానిపై కార్యాచరణ రూపొందించనున్నామని తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టం వ్యవహారం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, ఏదో ఒక ఫలితం వస్తే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇందుకు బాధ్యతగా అధికార పార్టీలో గెలుపొందిన ముస్లిం ఎమ్మెల్యేలు, ఎంపీలు తక్షణమే రాజీనామా చేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు విషయంలో ముస్లింలపై చంద్రబాబు వైఖరి మరోసారి రుజువైందన్నారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తారని చెప్పారు. సమావేశంలో కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, ముస్లిం జేఏసీ కార్యదర్శి అబ్దుల్‌సమ్మద్, ఆవాజ్ కమిటీ జిల్లా నాయకులు మస్తాన్‌వలి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, ముస్లిం మత పెద్ద ఇద్రూస్ మౌలానా, విద్యార్థి సంఘం నేత రియాజ్, నాయకులు గన్నీకరీమ్, సోహేల్‌రాణా, ముల్లాఖాజా, జుబేర్, గౌస్, సలాం మౌలానా, కౌన్సిలర్లు హరీఫ్, కలాం, శశికళా రెడ్డి, అనిల్‌అమృతరాజ్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీఓ రాజేంద్ర ప్రసాద్

చాగలమర్రి: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సూచించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంపై సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ జాబ్ కార్డు పొందిన చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకానికి అర్హులన్నారు. ఈ పథకం ద్వారా ఉద్యాన పంటలైన మామిడి, జామా, సపోట, చీనీ, నిమ్మ, దానిమ్మ, గులాబీ, మల్లె, సన్నజాజి, మునగ తదితర పంటలను రైతులు సాగు చేసుకోవటానికి, సంరక్షణకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

కత్తెర మాత్రమే ఎందుకు తీసుకెళ్లారో?



వైద్యశాల కిటికీని తొలగించి మళ్లీ తగిలించిన దృశ్యం

దొర్నిపాడు: గ్రామీణ పశువైద్యశాలలో ఏముంటుందని చోరీ చేయాలనుకున్నారో తెలియదు గానీ మొత్తానికి తాళం పగలగొట్టి, కిటికీ తొలగించి దుండగులు లోనికి ప్రవేశించారు. అయితే ఆసుపత్రిలో నుంచి కేవలం కత్తెర తీసుకెళ్లిన ఘటన సోమవారం మండలంలోని క్రిష్టిపాడు పశువైద్యశాలలో చోటుచేసుకుంది. రోజులాగే ఉదయం జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రమణయ్య వైద్యశాలకు వచ్చాడు. తాళం తీద్దామని చూస్తే అప్పటికే పగల గొట్టినట్లు గుర్తించాడు. కంగారుగా లోనికి వెళ్లి చూడగా వెనుక భాగం నుంచి కిటికీ కూడా తొలగించారు. అన్నీ మందులు, వస్తువులను పరిశీలించి చూడగా కేవలం కత్తెర మిస్ అయినట్లు నిర్ధారించారు. లోపల ఉన్న బీరువాను మాత్రం ఏమీ చేయలేదు. వెంటనే పై అధికారి డాక్టర్ పుల్లయ్య, జేడీఓ రమణయ్యకు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా.. సాయంత్రం ఆ ప్రాంతంలో ఆకతాయిలతో రద్దీగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

శ్మశానికి దారి ఏర్పాటు చేయాలి



అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: శ్మశానికి వెళ్లేందుకు రహదారి లేక గ్రామంలో ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన వారు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరాములు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిధిలోని బోడెమ్మనూరు గ్రామస్తులతో కలిసి బీజేపీ నాయకులు శ్మశాన సమస్యను పరిష్కరించాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో స్థానిక గ్రామ సచివాలయంలో, గ్రామ సభల్లో కూడా దారి చూపాలంటూ విన్నమిస్తున్నా ఎవరూ పరిష్కరించలేదన్నారు. ఎవరైనా మరణిస్తే పొలాల గుండా వెళ్లాలని దీంతో రైతులు అభ్యంతరం చేస్తున్నట్లు చూపారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నుంచి బడికి



ఎంపీపీ స్కూల్లో చిన్నారులను చేర్పిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతూ ఐదేళ్లు నిండిన చిన్నారులను సోమవారం గ్యాడ్యుయేషన్ డేను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు. మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె అంగన్‌వాడీ కేంద్రం-1లోని చిన్నారులను కార్యకర్త తులశమ్మ స్థానిక ఎంపీపీ స్కూల్లో చేర్పించారు. హెచ్‌ఎం రాజేశ్వరమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువు నేర్పడం వల్ల విద్యలో మంచిగా రాణిస్తారన్నారు. టీచర్ వాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణి, మహిళా పోలీస్ శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంట పనులను పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



తేనెటీగల పెంపకంపై శాస్త్రవేత్తల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన 2500 పంట నీటి కుంటల నిర్మాణ పనులకు రైతులను ప్రోత్సహించి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓ, ఏపీడీలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉపాధి హామీ, ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రారంభం కాని నీటి కుంటలను గురువారంలోపు పూర్తి చేయాలన్నారు. పంట నీటి కుంటల చుట్టూ కూరగాయల పెంపకం, క్యాటిల్ షెడ్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నందున ఇన్లెట్, ఔట్లెట్ సరైన దిశలో ఉండే విధంగా టెక్నికల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ సలహా మేరకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో ఫారం పాండ్స్ నిర్మాణాలకు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు 26,276 పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 8722 పంపిణీ చేయడం జరిగిందని.. ఇంకా పెండింగ్‌లో ఉన్న 17,440 పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 25, 26వ తేదీల్లో భారత ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ పర్యటించనున్న సందర్భంగా ముమ్మర ఏర్పాట్లు చేయాలని ఈఆర్‌ఓలకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో 14 మండలాల్లో 45 హ్యాబిటేషన్స్‌లో ఉన్న చెంచుగూడేల ఓటర్ల వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ రాము నాయక్, డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, హౌసింగ్ పీడీ హరిహర గోపాల్, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

హెపటైటిస్‌పై అవగాహన అవసరం

హెపటైటిస్ బీ, సీ వైరస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని నిర్ధారణ పరీక్షల ద్వారా వ్యాక్సిన్లు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో హెపటైటిస్ బీ, సీ వైరస్‌పై అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని 2022లో ప్రభుత్వం సర్వజన ఆస్పత్రిగా అభివృద్ధి చేసిందన్నారు. ఇక్కడ రోగులకు విస్తృత వైద్య సేవలు అందజేస్తున్నారని తెలిపారు. మైక్రోబయాలజీ ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ హెపటైటిస్ బీ, సీ వైరస్ పరీక్షలు నిర్వహించే ఏకైక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నంద్యాలలో మాత్రమే ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు హెపటైటిస్ బి కేసులు 1.90 శాతం, హెపటైటిస్ సీ 0.17 శాతం మేరకు నమోదైనట్లు తెలిపారు. ఇంట్లో ఒకరికి హెపటైటిస్ వైరస్ నిర్ధారణ అయితే ఇంట్లో అందరూ పరీక్షలు చేసుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు.

గిరిజనుల జీవనోపాధి మెరుగునకు కృషి

నంద్యాల(అర్బన్): జిల్లాలో గిరిజనుల జీవనోపాధిపై దృష్టి సారించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. స్థానిక ప్రాంతీయ పరిశోధన కేంద్రంలో సోమవారం శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ఏడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. వ్యవసాయ పరిశోధన అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం.జాన్సన్, ఏడీఆర్‌సీ డీడీ చెన్నయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాను ఇప్పటి వరకు జిల్లాలో 12 గూడెంలలో పర్యటించి వారి స్థితిగతులను తెలుసుకున్నానని తెలిపారు. జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి నన్నారి మొక్కల పెంపకం, నన్నారి తయారు చేసే యంత్రాలను ఆత్మకూరులో ఏర్పాటు చేసి తద్వారా గిరిజనులు అధిక ఆదాయం పొందడం జరిగిందన్నారు. ఇదే తరహాలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకాన్ని చేపడితే నాణ్యమైన తేనెతో పాటు తేనెటీగల వల్ల వచ్చే వివిధ ఉత్పత్తులను కూడా మార్కెటింగ్ చేసి అధిక లాభాలను పొందవచ్చన్నారు. నారపురెడ్డి కుంట గ్రామానికి చెందిన చెంచులు, నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రైళ్లను పునరుద్ధరించాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం సీపీఐ బృందం నంద్యాల ఎంపీ శబరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య మాట్లాడుతూ.. పూర్వ ఆంధ్రప్రదేశ్ రాజధాని కర్నూలు నుంచి కోస్తా ప్రాంతాలకు సౌకర్యంగా ఉండే విధంగా నడుస్తున్న రైళ్లను కరోనా సమయంలో రద్దు చేశారన్నారు. నాలుగేళ్లు గడిచినా పునరుద్ధరించకపోవడంతో వ్యాపారులు, విద్యార్థులు, చిరువ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంతకల్లు, కర్నూలు రైలును, కర్నూలు-గుంతకల్లు ప్యాసింజర్‌లను పునరుద్ధరించి పాత సమయానికే నడపాలని డిమాండ్ చేశారు. డోన్ రైల్వే జంక్షన్‌లో లిఫ్టును ఏర్పాటు చేయాలని కోరారు.

వాన్స్ పర్యటనకు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారతదేశ పర్యటనకు వ్యతిరేకంగా ఏపీ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సోమవారం నంద్యాల సాయిబాబానగర్ సెంటర్‌లో నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు తోటమద్దు మాట్లాడుతూ.. రైతులకు నష్టం కలిగే విధంగా ప్రధాని మోదీ అమెరికాతో ఒప్పందం చేసుకుంటున్నారని ఆరోపించారు. మోదీ, ట్రంప్ దుర్మార్గమైన ఒప్పందాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు.


భూసార పరీక్షలపై అవగాహన



వీఏఏలకు భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరం: భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని మండల వ్యవసాయాధికారి సుమతి వీఏఏలకు సూచించారు. మండల కేంద్రమైన రుద్రవరంలో సోమవారం ఆమె వీఏఏలకు భూసార పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలా చేయించుకోవడం పొలాల్లో ఎంత మేర పోషక విలువలు ఉన్నాయో తెలుస్తుందని, వాటి ఆధారంగా ఎరువులు వాడవచ్చని చెప్పారు. మండలంలోని 16 గ్రామసచివాలయాల పరిధిలో 1,151 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తామని తెలిపారు. అనంతరం రుద్రవరంలో క్షేత్ర స్థాయిలో పొలాలు, బయలు ప్రదేశాల్లో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఏఈఓ రాజు తదితరులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణుల శ్రేయస్సే లక్ష్యం



నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): నాయీ బ్రాహ్మణుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని త్యాగరాజస్వామి ఆలయంలో జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల్లో అర్హులందరికీ సబ్సిడీతో కూడిన లోన్లు అందజేస్తారని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులకు పాలక మండలిలో సభ్యత్వానికి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్వేశి వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, నాగరాజు, మద్దయ్య, వెంకటయ్య, వెంకటబాబు, రాంపుల్లయ్య, శినయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.